మూకుమ్మడిగా వచ్చినా వైఎస్సార్‌సీపీకి తిరుగులేదు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- ఘనంగా పెంచిన పింఛన్ల పంపిణీ


సంక్షేమ పథకాలు అందుతున్నాయంటూ ఎమ్మెల్యేకు చేతులెత్తి చెబుతున్న లబ్ధిదారులు

కొమ్మాది: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, కాంగ్రెస్, తదితర పార్టీలు మూకుమ్మడిగా వచ్చినా మళ్లీ గెలిచేది మూడు రెక్కల ఫ్యానేనని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ బీసీ కాలనీలో రూ.3 వేలకు పెంచిన వైఎస్సార్ పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పెన్షన్ లబ్ధిదారులతో కలిసి ముత్తంశెట్టి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో మీ ఇంటికి పెన్షన్ వచ్చిందా? వైద్యం అందిందా? రేషన్ వచ్చిందా? ప్రభుత్వ సేవలు మీ ఇంటి వద్దకే వచ్చాయా? అని ప్రజలను ప్రశ్నించారు. చేసే వారెవరో, చెప్పేవారెవరో ప్రజలు గమనించాలి ఆయన సూచించారు. ఒక్క జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనడానికి రాష్ట్రంలోని అన్ని పార్టీలు ఏకమై వస్తున్నాయని, వారికి ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన లేదని, వ్యక్తిగత రాజకీయాల కోసం వస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేల పెన్షన్ ఇస్తున్నారా? లేదా? అని అడిగారు. భీమిలిలో మళ్లీ గెలిచేది వైఎస్సార్‌సీపీ అని, గత ప్రభుత్వంలో, ఈ ప్రభుత్వంలో భీమిలి ఎంత అభివృద్ధి చెందిందో అందరూ గుర్తించాలన్నారు. వృద్ధులకు రూ.3 వేలు పెన్షన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, పార్టీ నాయకులు గుడ్ల పోలిరెడ్డి, ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, ముదుండి రాజేశ్వరి, లొడగల రామ్మోహన్, మాదు చంటి, బుజ్జి, రమణ మూర్తి, పద్మావతి, చెన్నాదాసు, అప్పలరాజు, చెన్నా ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


పెన్షన్ చెక్కు నమూనాను అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమిలిలో..
భీమునిపట్నం: భీమిలిలోని అప్పికొండవీధి సచివాలయ పరిధిలో శుక్రవారం పింఛన్ల పంపిణీ పూర్తయింది. స్థానికంగా 110 పింఛన్లు ఉండగా సచివాలయ కన్వీనర్ ఆర్.దేవి ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో గృహ సారథులు సంకురు భుక్త రమేష్, ఎం.ఆదిలక్ష్మి, వలంటీర్లు పాల్గొన్నారు.

మధురవాడ వాంబే కాలనీలో ..
మధురవాడ: అందరి ముఖాల్లో చిరునవ్వు చూడడమే నిజమైన అభివృద్ధి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 7వ వార్డు వాంబే కాలనీలో శుక్రవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్లు రూ.3వేలకు పెంచిన సందర్భంగా పింఛనర్లతో కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పింఛన్ల పెంపుపై లబ్ధిదారులంతా చేతులెత్తి హర్షధ్వానాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పుడు రాష్ట్రంలో కేవలం 30లక్షల పెన్షన్లు ఉంటే రూ. 500కోట్లు ఖర్చు చేసేవారని, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 68 లక్షల పెన్షన్లు ఉంటే రు. 2వేలు కోట్లు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ఇలా లక్షలాది మంది ఆనందంగా ఉంటే అంతకంటే మరేమి కావాలన్నారు. కేవలం మధురవాడలోనే సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.307 కోట్లు, అభివృద్ధి కోసం రూ.60 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. అనంతరం మున్సిపల్ కార్మికుకుల నుంచి వినతి పత్రం స్వీకరించారు. వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్సీ కనక మహాలక్ష్మి, ఈఈ శాంతిరాజు, ఏపీడీ గంగాధర్, వైఎస్సార్‌సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జేసీఎస్ కన్వీనర్లు కుడితి రామారావు, గాదె రోశిరెడ్డి, 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, నాయకులు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


భీమిలిలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న సిబ్బంది


మధురవాడ వాంబేకాలనీలో లబ్ధిదారులకు పెన్షన్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ


శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లి అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

బంగ్లామెట్ట పాఠశాల సందర్శన


బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలను సందర్శిస్తున్న భీమిలి ఎంఈవో-2 జయప్రద


తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో-2 జయప్రద సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో ఇంగ్లిష్‌లో మాట్లాడాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం మెరుగుపరచాలన్నారు. పాఠ్యాంశాలతో పాటు టోఫెల్‌ను విధిగా బోధించాలని చెప్పారు. పాఠ్య ప్రణాళికలు, టీచింగ్ నోట్స్, టీచర్ డైరీ తప్పకుండా ఉపాధ్యాయుల వద్ద ఉండాలన్నారు. స్మార్ట్ టీవీల ద్వారా విద్యార్థులకు వివిధ సబ్జెక్టులపై అవగాహన తరగతులు, అదనపు కంటెంట్ బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరం


పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

పద్మనాభం: పశువులకు సోకే గాలి కుంటు వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని రెడ్డిపల్లి పశువైద్యాధికారి ఆర్.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఐనాడ, బి.ఆర్.తాళ్లవలస, రెడ్డిపల్లి గ్రామాల్లో 120 పశువులకు శుక్రవారం గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పుడు పశువులకు గాలి కుంటు వ్యాధి సోకుతుందన్నారు. కార్యక్రమాల్లో ఏహెచ్ఏ బి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'విరాట్-2024'



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

పీఎంపాలెం: జీవీఎంసీ 8వ వార్డు క్రికెట్ స్టేడియం సమీపంలోని ఎన్‌వీపీ లా కాలేజీ, సీమ్స్, సీఎంటీ కళాశాలల ఆధ్వర్యంలో విరాట్-2024 పేరుతో 2 రోజుల ఫెస్ట్ శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. కరస్పాండెంట్ రవీంద్ర, వ్యాపారవేత్త గంధం సునీత, ఈడీ దీపిక తదితరులు మాట్లాడుతూ రైతు ప్రాముఖ్యత, సేంద్రియ ఆహారం, కూరగాయల గురించి వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

తగరపువలస: భీమిలి మండలం శింగనబంధ, నారాయణరాజుపేట పంచాయతీలలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో జానకి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ కె.ఎం.సింగ్, డిప్యూటీ కార్యదర్శి ఎస్.ఎస్.మిశ్రా ఈ కార్యక్రమంలో పాల్గొని పీఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల యోజన, జల్ జీవన్ మిషన్, పనికి ఆహార పథకం వంటి 17 రకాలైన కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి తెలియచేశారు. అర్హత కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి ఈ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా పీఎం ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా 35 శాతం సబ్సిడీతో కూడిన రెండు ఆటోలు, కార్పెంటర్ గేజ్ మిషన్లను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భీమిలి కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, సెర్ప్ డైరెక్టర్ శ్రీనివాసరావు, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సర్పంచ్‌లు గాడు వెంకటనారాయణ, కాద సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు తుపాకుల అప్పలరాజు, మజ్జి శ్రీనివాసరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గాడు శ్రీను, సీడ్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, నిమ్మకాయల అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.


శింగనబంధలో మాట్లాడుతున్న కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ కె.ఎం.సింగ్

వేడుకగా అయోధ్య అక్షింతల ఊరేగింపు


టి.నగరపాలెంలో ఊరేగింపుగా తీసుకువెళ్తున్న అక్షింతలు


కృష్ణంరాజుపేటలో ఊరేగింపుగా తీసుకువెళ్తున్న అక్షింతలు

తగరపువలస: అయోధ్య భవ్య రామ మందిరం ప్రతిష్ట వేళ అక్కడ నుంచి వచ్చిన అక్షింతలను శుక్రవారం పలు గ్రామాలలో తలపై పెట్టుకుని ఊరేగింపుగా తీసుకువెళ్లి ఇంటింటా పంపిణీ చేశారు. భీమిలి మండలం టి.నగరపాలెం, సింగనబంధ పంచాయతీ కృష్ణంరాజుపేట రామాలయాల నుంచి వీటిని ఇంటింటా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు శిక్షణ తరగతులు

డాబాగార్డెన్స్ : స్వయం సహాయక సంఘ సభ్యులందరికీ సుస్థిర జీవనోపాధి అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేశారని మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్(యూసీడీ) కేవీ పాపునాయుడుతో 4 జిల్లాల పథక సంచాలకులు, మెప్మా సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘ సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారికి అవగాహనతో కూడిన శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. జగనన్న మహిళా మార్ట్, జగనన్న ఈ-మార్ట్, పట్టణ ప్రగతి యూనిట్లు, ఆహా క్యాంటీన్లు, మెప్మా అర్బన్ మార్కెట్లు, చేయూత జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేయడమైందన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ టిడ్కో గృహాల లబ్ధిదారులకు శత శాతం రుణాలు అందించేందుకు బ్యాంకులకు అనుసంధానం చేసి, అనుకున్న టార్గెట్‌ను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అనకాపల్లి నుంచి సరోజిని, శ్రీకాకుళం నుంచి ఎం. కిరణ్‌కుమార్, విజయనగరం నుంచి బి. సుధాకరరావు, ఎస్ఎంసీలు ఆదినారాయణ, ఎస్. శ్రీనివాసరావు, రంగాచారి, లక్ష్మీనారాయణతో పాటు 4 జిల్లాల నుంచి డీఎంసీలు, సీవోలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 23వ రోజు శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ, క్షీరాభిషేక సేవ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల మూడు వందల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.


అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

బీమా పాలసీదారు మరణిస్తే తల్లికి పరిహారం

విశాఖ లీగల్ : బీమా పాలసీ అమలులో ఉండగా పాలసీదారుడు మృతి చెందితే పరిహారాన్ని తల్లికి చెల్లించాలని విశాఖలోని వినియోగదారుల మండలి-1 అధ్యక్షురాలు డాక్టర్ గుడ్ల తనూజ తీర్పునిచ్చారు. బీమా సొమ్ము 24,08,432 రూపాయలతో పాటు, రూ.40 వేల పరిహారం, రూ. 5 వేల ఖర్చులు చెల్లించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం వైఎస్సార్ నగర్ ప్రాంతానికి చెందిన శెట్టి నూకేశ్వరరావు 2021 ఏప్రిల్‌లో మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పాలసీ తీసుకున్నారు. అతనికి 2023 ఆగస్టులో పచ్చకామెర్లు వచ్చి మరణించారు. బీమా పాలసీ అమలులో ఉన్నందున తమ కుమారుడికి సంబంధించిన సొమ్మును ఇవ్వాలని మృతుడి తల్లి వినియోగదారుల మండలిని ఆశ్రయించారు. మృతుడిది ప్రమాదం, లేదా సహజ మరణం కానందున పాలసీ సొమ్ము ఇవ్వడానికి వీల్లేదని కంపెనీ స్పష్టం చేసింది. దీనిపై సమగ్ర విచారణ జరిపిన న్యాయమూర్తి మృతుడు మరణించిన సమయంలో పాలసీ అమల్లో ఉన్నందున బీమా సొమ్ము ఇవ్వాలని పేర్కొన్నారు.

8 నుంచి శిల్పారామంలో సంక్రాంతి పోటీలు

మధురవాడ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మధురవాడ శిల్పారామం జాతరలో జనవరి 8, 9,10 తేదీల్లో పలు పోటీలు నిర్వహిస్తున్నట్టు శిల్పారామ అధికారి విశ్వనాథరెడ్డి చెప్పారు. ఇందులో భాగంగా 8వ తేదీన సాయంత్రం 3గంటలు నుంచి 5గంటలు వరకు గాలిపటాలు పోటీలు, 9వ తేదీన సాయంత్రం 5గంటలు నుంచి 6గంటలు వరకు 10 ఏళ్ల లోపు పిల్లలకు సంప్రదాయ వస్త్రధారణ, 10వ తేదీ మధ్యాహ్నం 2గంటలు నుంచి 4గంటలు వరకు ముగ్గులు పోటీలు నిర్వహిస్తారు. ముగ్గులు పోటీలకు కావలసిన సామగ్రి ఎవరికి వారే తెచ్చుకోవాలి. 13,14, 15,16 తేదీల్లో సాయంత్రం మధురవాడకు చెందిన ప్రైవేటు పాఠశాల విజయం సౌజన్యంతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొన దలచిన వారు 96526 28100, 63090 29591లలో సంప్రదించాలని విశ్వనాథరెడ్డి కోరారు.

అర్హత గల కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు టెండరులో పాల్గొనాలి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీలో పొరుగు సేవల ద్వారా పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు గత నెల 26 నుంచి విధులకు గైర్హాజరవుతున్నందున గృహ, గృహేతరాల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థపదార్థాలు ఎప్పటికప్పుడు తరలించేందుకు అద్దె ప్రాతిపదికన టాటా వెహికల్స్ సమకూర్చేందుకు స్వల్ప వ్యవధితో కూడిన ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ జారీ చేసినట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు టెండర్ నియమ నిబంధనలకు లోబడి పాల్గొనాలని కమిషనర్ పేర్కొన్నారు.

గోస్తనిలో జారి పడి యువకుడి మృతి


రాము మృతదేహం

పద్మనాభం: పాండ్రంగి పంచాయతీ సామయ్యవలస వద్ద శుక్రవారం గోస్తనిలో కాలు జారి పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఏఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. సామయ్యవలస చెందిన సేనాపతి రాము(34) మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో గోస్తని నదిలో స్నానం చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలు జారి నదిలో పడి మరణించాడు. రాము భార్య వెంకట లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఫౌంటేన్ కాదిది..

- ఎయిర్ వాల్వ్‌ను ఢీకొన్న లారీ
- తాగునీరు వృథా


చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం వద్ద ఎగజిమ్మిన పైప్‌లైన్

తగరపువలస: చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం వద్ద ఎయిర్ వాల్వ్‌ను శుక్రవారం సాయంత్రం సిమెంట్ లారీ ఢీకొనడంతో లీకై.. అరగంట పాటు నీరు వృథాగా పోయింది. జీవీఎంసీ భీమిలి జోన్ కొండపేట పంప్‌హౌస్ నుంచి భీమిలి పట్టణానికి ఇటువైపు నుంచే పైప్‌లైన్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ఎయిర్ వాల్వ్‌ను ఢీకొన్న కారణంగా విద్యుత్ స్తంభం కంటే ఎత్తుగా నీరు ఎగసిపడి.. వైర్లను తాకుతూ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. వెంటనే చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది స్పందించి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. నీటి సరఫరా సిబ్బంది చిల్లపేట చెరువు వద్ద స్లూయిస్ తెరిచి, తదుపరి చర్యలు చేపట్టారు.

ధర్మపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్

- ఓర్వలేకనే పచ్చమీడియా, పవన్ దుష్ప్రచారం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


సంక్షేమ పథకాల డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ధర్మపాలన చేస్తుంటే చంద్రబాబు, పవన్, పచ్చ మీడియా ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం పెద నాగమయ్యపాలెంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారులంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తనకు కూడా గౌరవం ఉందన్నారు. మోపిదేవి వెంకటరమణ, సీదిరి అప్పలరాజు, కోలా గురువులు, వాసుపల్లి గణేష్ కుమార్‌లకు సముచిత స్థానం కల్పించారన్నారు. చంద్రబాబు హయాంలో మత్స్యకారులకు చేసింది శూన్యమన్నారు. మత్స్యకారులను జగనన్న అక్కున చేర్చుకుని డీజిల్ సబ్సిడీ పెంపు, ప్రమాద పరిహారం రూ.10 లక్షలకు పెంపు, ఇప్పటికి అయిదు విడతలుగా మత్స్యకార భరోసా అందించారని గుర్తు చేశారు. తాను కూడా ప్రత్యేకంగా ఈ పంచాయతీ యువకులకు డీసీఐలో ఉద్యోగావకాశాలు కల్పించానన్నారు. పంచాయతీలో ప్రభుత్వం తరపున రూ.18 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.3 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మత్స్యకారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల కృతజ్ఞతా భావం చూపించాలని కోరారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అలాగే, లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు సత్తెమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు తోట అరుణ, బొడ్డు దుర్గారావు, తోట ఎల్లారావు, భీమిలి ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, మండల పార్టీ యూత్ అధ్యక్షుడు చిల్ల హరి, సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ అప్పలరాజు, ఏపీఎం రంగారావు, సచివాలయ కార్యదర్శి శశికళ, బడే ఎల్లారావు, జీరు పోలిరెడ్డి, గరికిన నూకరాజు, చెల్లపల్లి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం కార్మికుల ఆందోళన

వేతన బకాయిల చెల్లింపునకు డిమాండ్


గంగవరం పోర్టు లోపల బైఠాయించిన కార్మికులు

పెదగంట్యాడ : అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులకు 44 రోజుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. గంగవరం పోర్టు లోపల రైల్వే ట్రాక్ గేటుతో పాటు ఔట్ గేటు వద్ద వీరంతా బైఠాయించారు. వెంటనే వేతన బకాయిలు చెల్లించాలంటూ నినాదాలతో హోరెత్తించారు. పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కడంతో యాజమాన్య ప్రతినిధులు న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని, బందోబస్తు నిర్వహించారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. గరికిన నూకరాజు అనే కార్మికుడు వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు తరలించారని, అయితే అతనికి కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించేందుకు యాజమాన్యం నిరాకరించిందన్నారు. కార్మికులంటే యాజమాన్యానికి చిన్నచూపు తగదన్నారు. వెంటనే యాజమాన్యం తన వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అడవివరం కో- ఆపరేటివ్ సొసైటీ మహాజనసభ రేపు

సింహాచలం: అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజనసభ ఆదివారం నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. ప్రియాగార్డెన్స్‌లోని స్వామి బృందావనం కల్యాణ మండపంలో ఉదయం 9.45గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిపారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి సంఘ సభ్యుల షేర్‌ధనంపై చెల్లించే వడ్డీ , త్రిప్ట డిపాజిట్లకు వడ్డీ చెల్లించే విషయాలపై ఆమోదం తెలిపే అంశాలతో పాటు సంఘం అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై సభలో చర్చించనున్నట్టు తెలిపారు. సంఘ సభ్యులందరూ హాజరు కావాలని స్వామి కోరారు.